


# ది మేకింగ్ ఆఫ్ ఏ రైటర్

జేసి.జేపి

టర్ ...టక్ ...టర్ ...టక్ ... టర్ ...టక్

ప్రెస్సు చక్రాలు తిరుగుతున్నాయి. అచ్చయిన ఫారాలు పేరుకుపోతున్నాయి. ప్రూఫ్ రీడర్లకు మెడలు పట్టుకుపోతున్నాయి. కంపోజిటర్ల బనీన్లు చెమటతో తడిసిపోతున్నాయి. కొండగుహలా వుంది ఆ ప్రెస్సు అందులో పనిచేసేవాళ్ళు గుహలో చిక్కడిపోయిన వింత జీవాల్లా వున్నారు. కంపోజింగ్ సెక్షనులో ఫ్యాను లేదు. కిటికీలు కూడా లేవు. పొరపాటునయినా అక్కడికి గాలి చొరబడే అవకాశం లేదు. గాలి ఉండకూడదంటాడు ప్రెస్సు యజమాని.

గాలికి ప్రింటింగు ఇంకు ఆరిపోతుందిట!

కంపోజిటర్లకు చల్లగాలి తగిలితే ఒళ్ళు తెలిపోయి అచ్చుతప్పు లొచ్చేస్తాయిట!

ప్రింటయిన ఫారాలు ఎగిరిపోతాయిట!

ప్రొప్రయిటరుకి మాత్రం ముందర హాల్లో ఒక రివాల్వింగు కుర్చీ, పైన సీలింగు ఫ్యానూ వున్నాయి. ఉండాల్సిందేమరి. అతనికి కళ్ళు చించుకుని కంపోజింగు చెయ్యవల్సిన పని లేదు. మెడలు విరుచుకుని ప్రూపులు దిద్దేఖర్మ లేదు. చేతులు పడిపోయేట్టు ఫారాలు మడిచే అవసరం లేదు.

ఉగాదికి ఇంకా రెండు రోజులే వుంది.

మూడురోజులకు ముందే ప్రత్యేక సంచిక డిస్పాచి కావాల్సింది. కాని ఈసారి అనుకోని అవాంతరా లొచ్చి పత్రిక విడుదల ఆలస్యమయ్యేట్టుంది. కొత్త సంవత్సరం రెండ్రోజుల పాతదయేకగాని పత్రిక ఆంధ్ర దేశం చేరేట్టు లేదు.

ఈ సారి ప్రత్యేక సంచికలో వర్ధమాన రచయిత్రి సీరియల్ నవలారాజం "లేడీ టైపిస్టు" ప్రారంభం కాబోతోంది. సదరు ప్రకటన మూణ్ణెల్లనుంచీ అశేషాంధ్ర సీరి

యల్ నవలా పాఠకాభిమానుల్ని పూరించేస్తోంది. ప్రకటించిన నవల పేజీలుమినహా మిగతా ఫారాలన్నీ రెడీ అయిపోయాయి. ఫ్లూ జ్వరంతో సీనియర్ కంపోజిటర్ మూడు రోజులు సెలవు పెట్టేడు. జ్వరం తగ్గీతగ్గక ముందే ఓవర్ టైము ఎరచూపి పిల్చుకొచ్చాడు ప్రొప్రయిటరు. పత్రిక మరీ ఆలస్యం కాకూడదు మరి.

''లేడీ టైపిస్టు'' ఫైనల్ ప్రూఫుని ఓకే చేసి వూపిరి పీల్చుకున్నాడు ప్రూఫ్‌రీడరు.

ఓ పావుగంటకాలం ప్రెస్సు విశ్రాంతి తీసుకుంది. చక్రాలు మళ్ళీ కదిలినయ్.

రెండ్రోజుల ఆలస్యంతో - అందంగా ముస్తాబై పూరించి పూరించి ఆలస్యంగా లోపలికి అడుగు పెట్టిన కొత్త పెళ్ళికూతురులా ఆంధ్రదేశంలో పత్రిక విడుదలయింది.

రెండు ఉగాదులు వెళ్ళేయి.

''బంగారు వలలు'', ''డ్రింకు నగరం'', ''పావన జీవితాలు'' నవలల ధారావాహిక ప్రచురణతో వర్ధమాన రచయిత్రి సుప్రసిద్ధ రచయిత్రిగా మారిపోయింది.

ఇప్పుడు నాలుగైదు ప్రెస్సుల్లో ఆమె నవలల ప్రూఫుల్ని కొన్ని బక్కచిక్కిన జీవాలు మెడలు విరుచుకుని దిద్దుతున్నాయి. మరికొన్ని ఎముకలపోగులు ఆమె అక్షరాల్ని కంపోజు చేస్తున్నాయి. మాట్లాడలేని మరలు ముచ్చటగా ఆమె నవలల్ని అచ్చేస్తున్నాయి.

రెండు స్టూడియోల్లో ఆమె కథలకి ప్రారంభోత్సవాలు జరిగేయి. ఒకానొక నవల్లోని కథానాయిక పాత్రకి సరిపోయేది తనేనని ఒక ప్రముఖ హీరోయిన్ అభిప్రాయ పడుతున్నట్టు పత్రికల్లో వార్తలొచ్చేయి. ఆ ఛాన్సే తనకి తగిల్తే తనదశ తిరిగిపోతుందని ఒక వర్ధమాన తార కలలు కంది. నాకోసం ఒక కామెడీపాత్రని సృష్టించమని ప్రాధేయపడుతూ రచయిత్రికి రాసేడు వేషాల్లేని ఒక హాస్యనటుడు. ''బంగారు వలలు'' నవల్లోని కొత్తరకం విలన్‌కి కొత్తరకం ముఖాన్ని పరిచయంచేస్తే ఎలా వుంటుందని ఆలోచనలు చేసింది ఒక దర్శక మస్తిష్కం.

అచిరకాలంలోనే సీరియల్ నవలా మహారాణిగా ప్రసిద్ధికెక్కిన రచయిత్రినిచూసి చాలా మందికి కన్ను కుట్టింది. కిట్టనివారు ఆమె రాతల్ని విమర్శిస్తూ పత్రికలకి వుత్తరాలు వ్రాయటం ప్రారంభించారు. అయినా అంత విరివిగా రచనలు చేయడంలో ఆమెకుగల ఓపికనుమాత్రం మెచ్చుకోకుండా వుండలేక పోయారు. గంగిగోవుపాలు గరిటెడయినా చాలు అని వాదించారు కొందరు. ఖరముపాలు కూడా కొన్ని రోగాలకి పనికొస్తాయిగదా అన్నారు మరికొందరు. ఈ వాద ప్రతివాదాల ప్రభావం రచయిత్రి మీద బాగా పనిచేసింది. తనకు పరీక్షా సమయం ఆసన్నమయిందని గ్రహించింది. త్వరలోనే ఒక గొప్ప అభ్యుదయ సీరియల్ రాసేసి తనని విమర్శించే వాళ్ళ నోళ్ళు మూయించాలని అనుకుంది. అలా అనుకుంటూ ఏదో వార పత్రిక తిరగేసిన ఆమెకి ప్రెస్సు కార్మికుల కష్టాలను గురించిన ఒక వ్యాసం కంటబడింది. ఆహా ! ఏమి చిత్రం! రాత్రింబవళ్ళు చెమటోడ్చి, తన రచనలకి అక్షరాలు కూర్చి తన నింత దాన్ని చేసి, తాము మాత్రం తెర మరుగునే వుండిపోయిన ఈ అభాగ్యులని గురించి తానింతకాలం ఆలోచించకపోవటం ఎంత ఘోరం! ఎంత నేరం! రాయటం ప్రారంభించింది రచయిత్రి. ఒక్క

సిట్టింగులోనే ఏడు వారాల కథను నడిపిం చేసింది. అప్పుడు తట్టింది ఆమెకి, ప్రెస్సు వర్కర్లని గురించిన నవల రాయాలంటే ముందుగా ప్రెస్సునీ, అందులో పని వాళ్ళనీ చూడటం అవసరం అని. తను వర్ధమాన రచయిత్రిగా వున్నప్పుడు తన మొదటి నవలని అచ్చేసిన ప్రెస్సుకే వెళ్లింది. కొండగుహ లాంటి ఆ ప్రెస్సునీ, అస్తి పంజరాల్లాంటి పనివాళ్ళనీ చూసి నిజంగానే ఆమె హృదయం ద్రవించి ఏడ్చింది.

మూడు నెలల్లో "ఆస్తిపరులూ - అస్తి పంజరాలూ" నవల పూర్తయింది. బి. ఏ. ఫస్టు క్లాసులో పాసై నిరుద్యోగపు కోరల్లో చిక్కుకుని, చివరకు ప్రెస్సులో కంపోజి టర్‌గా చేరిన ఆనందరావు-అందమైనవాడు ఆజానుబాహువులవాడు, విశాల హృదయం మాత్రమే కాదు ఛాతీ కూడా వున్నవాడు- కథానాయకుడు. ప్రెస్సు యజమాని విలన్ అతని కూతురు హీరోయిన్. కథ ఎన్నో మలుపులు తిరిగి తిరిగి చివరకు ప్రెస్సు యజమాని కూతురు తండ్రి నెదిరించి ఆనంద రావుని ప్రెస్సు అక్షరాల సాక్షిగా ప్రెస్సు లోనే పెళ్ళాడేసి ఆ ప్రెస్సులోనే లేడీ కంపోజిటర్‌గా కుదురుకోవటంతో నవల మొదటి భాగం ముగుస్తుంది. పత్రికకు పంపి వాళ్ళు వేసుకునేదాకా ఆగడం ఎందు కని ప్రెస్సు యజమాని చేతే తన పుస్తకం అచ్చేయించింది. అయిదు నెలలు తిరక్కుం డానే అయిదువేల ప్రతులూ అమ్ముడయి పోయేయి. ఏడాది తిరిగేసరికి అఖిలాంధ్ర అభ్యుదయ రచయిత్రుల సంఘానికి ఉపాధ్య క్షురాలుగా ఎన్నుకోబడింది "ఆస్తిపరులూ- అస్తి పంజరాలూ" రచయిత్రి.

మళ్ళీ ఉగాది వచ్చింది.

మళ్ళీ ప్రత్యేక సంచిక తయారవుతోంది. కాని కొండగుహలాంటి ప్రెసులోన్సే మన రచ యిత్రి మొదటి సీరియల్ నవలకి అక్షరాలు కూర్చి ప్రారంభోత్సవం చేసిన సీనియర్ కంపోజిటర్ ఇప్పుడు లేడు. రెండో సంచి కకు అక్షరాలు కూర్చే భాగ్యాన్నే దక్కించు కోలేక పోయాడు. మామూలు ఫ్లూ అను కున్నది ఓవర్ టైము ప్రభావంతో విష జ్వరంగా ముంచుకొచ్చింది. వారం రోజుల్లో కన్ను మూసిన ఆ సీనియర్ కంపోజిటర్ స్థానంలో పదిహేడేళ్ళ అతని పెద్ద కొడుకు వాణికే చేతులతో టైప్పుని వెదుకుతున్నాడు రచయిత్రి మొదటి నవలకు ప్రూఫులు దిద్దిన అసిస్టెంటు ప్రూఫు రీడరు టి. బి. హాస్పి టల్లో చేరి ఇంకా తిరిగి రాలేదు. ఆ స్థానంలో పదహారు నిండని అతని పడుచు చెల్లెలు అప్రెంటీసుగా చేరింది.

ఎవరు మారినా మారని ప్రొప్రయిటరు మాత్రం రివాల్వింగు కుర్చీలో కూర్చుని సిగరెట్టు పీలుస్తూనే వున్నాడు. మధ్య మధ్య ప్రూఫులు దిద్దుతున్న అమ్మాయిని ఓరగా చూస్తూనే వున్నాడు.

కొత్తగా కట్టుకున్న యింట్లో ఏర్ కండిషన్డు గదిలో కూర్చునుంది రచయిత్రి. ఆమె పక్కన సోఫా మీద మూడు పూర్త యిన నవలలు, రెండు పూర్తి కావల్సిన సీరియల్సూ పడి వున్నాయి. సోఫా వెనక బుక్ షెల్ఫులో కొత్తవీ, పాతవీ ఇంగ్లీషు నవలలు కలగాపులగంగా పేర్చి వున్నాయి. గది బయట ఆమె దర్శనం కోసం అయి దారుగురు (ప్రొడ్యూసర్లో, పబ్లిషర్లో) కాచు క్కూర్చున్నారు. గదిలోపల సోఫాలో వాలి ఏ నవల, ఎవరికి, ఎంతకివ్వాలా అనే దీర్ఘా లోచనలో మునిగిపోయింది రచయిత్రి. *